భీమవరం ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 38.0

కనిష్ఠం : 22.0



భీమవరంలో ముస్లింల ప్రార్థనలు

ఈద్ ముబారక్

- జిల్లావ్యాప్తంగా రంజాన్ వేడుకలు
- మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

భీమవరంటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాలో భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు, మార్టేరు, ఆచంట, పెనుగొండ వంటి ప్రధాన మసీదులతో పాటు మండలాల్లోని పలు గ్రామాల్లోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసుకుని దీక్షలు విరమించారు. భీమవరంలోని సున్నీ జామియా ఈద్గా మైదానంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రార్థనలు చేశారు. పెద్ద మసీదులో ముస్లింలకు నూతన వస్త్రాలను అందించారు. పండుగ సందర్భంగా ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. పాయసాన్ని తయారు చేసి బంధువులు, స్నేహితులకు అందించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మసీదులు విద్యుత్‌కాంతులతో దర్శనమిచ్చాయి.



ముస్లింల ఆలింగనం



గణపవరంలో చిన్నారులు



ఎస్పీ నయీం అస్మి. నమాజ్





పవన్, లోకేశ్, నాయకర్ వున్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న స్కూల్ కమిటీ, టీడీపీ, జనసేన నాయకులు (ఇన్‌సెట్‌లో) మొగల్తూరు ఉన్నత పాఠశాల

పవన్, లోకేశ్‌లను మరువం

- మొగల్తూరు టీడీపీ, జనసేన నాయకులు

మొగల్తూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మొగల్తూరు అభివృద్ధికి సంకల్పించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, గ్రామంలోని ఉన్నత పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌లను మొగల్తూరు ప్రజలెవ్వరూ మరిచిపోలేమని టీడీపీ, జనసేన నాయకులు అన్నారు. మొగల్తూరు ఉన్నత పాఠశాలకు రూ.1.71 లక్షల నిధులు మంజూరైన సందర్భంగా మొగల్తూరు ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిద్దరితోపాటు ఎమ్మెల్యే నాయకర్ ఉన్న ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మంజూరైన నిధుల వినియోగం ఇలా.. పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ.31.06 లక్షలు, భోజన శాలకు రూ.26 లక్షలు, ఇండోర్ స్టేడియం నిర్మాణం పూర్తిచేయడానికి రూ.30లక్షలు, క్రీడా ప్రాంగణం అభివృద్ధికి రూ.59.5లక్షలు, పాఠశాల ప్రహరీ అభివృద్ధికి రూ.10లక్షలు, సైకిల్ స్టాండ్ నిర్మాణానికి రూ.10లక్షలు, ల్యాబ్ నిర్మాణానికి రూ.5 లక్షలు నిధులు కేటాయించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ కొల్లాటి విశాలాక్షి, వైస్ చైర్మన్ గాది సత్తిబాబు, హెచ్ఎం వర్ధమాన రవిశంకర్ సర్కార్, సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, కూటమి నాయకులు కలిదిండి కుమార్ బాబు, మామిడిశెట్టి సత్యనారాయణ, కొల్లాటి గోపి, బోణం నర్సింహరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో ఒరిగిన బలరాముడి విగ్రహం

7



ఆక్వాకు మంచి రోజులు!

ఆక్వాలో విద్యుత్ రాయితీపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జిల్లా కలెక్టర్ల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు రాయితీపై దిశానిర్దేశం చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న చెరువులకు రాయితీ వర్తిస్తుందని యూనిట్ విద్యుత్‌ను రూ.1.50లకు ఇస్తామని తేల్చి చెప్పారు. ఎన్నికల ముందు ప్రతి ఒక్కరికీ యూనిట్ విద్యుత్‌ను రూ. 1.50లకు ఇవ్వనున్నట్టు కూటమి తరపున చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అయితే రిజిస్ట్రేషన్ మెలికతో రైతుల్లో ఒకింత ఆందోళన ఉంది. జిల్లాలో 50శాతానికి పైగా చెరువులకు రిజిస్ట్రేషన్‌లు లేవు. అధికారులు ఇప్పుడు సర్వేకు సిద్ధమవుతున్నారు. రిజిస్ట్రేషన్ చెరువులను గుర్తిస్తారు. వాటికి మాత్రమే రాయితీ వరిస్తుంది. రిజిస్ట్రేషన్ చేసుకుంటే అన్నింటికి రాయితీ కల్పించనున్నారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :

- ఆక్వా చెరువులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో ఆక్వాసాగు
- 48 వేల ఎకరాలకే రిజిస్ట్రేషన్
- 13,000 విద్యుత్ కనెక్షన్‌లకు వర్తిస్తున్న రాయితీ
- నాన్ ఆక్వా జోన్‌లో రిజిస్ట్రేషన్‌పైనే అయోమయం

విద్యుత్ రాయితీ కోసం ప్రభుత్వం రిజిస్ట్రేషన్ విధానాన్ని అమలు చేయడం వెనుక సదుద్దేశమే ఉంది. రొయ్యలు, చేపలు సాగు చేస్తే రైతులు సునాయాసంగా విక్రయించుకోవడానికి రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుంది. యాంటీబయోటిక్ వంటి మందులను కొందరు వినియోగించడం వల్ల రొయ్య ఎగుమతులపై ప్రభావం చూపుతోంది. దీనివల్ల రైతలందరూ నష్టపోయే పరిస్థితి తలెత్తుతోంది. ఒక్కోసారి కంటైనర్‌లను విదేశాలనుంచి తిప్పి పంపుతున్నారు. అదే రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతులనుంచి కొనుగోలు చేసుకున్న ఉత్పత్తులకు ముందుగానే గుర్తింపు ఉంటుంది. యాంటీబయోటిక్ అవశేషాలు లేనట్టయితే అటువంటి రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లే అవకాశం లేదు. మరోవైపు చేపల్లోనూ పురుగుమందుల అవశేషాలున్నాయంటూ అస్సాం, బిహార్ వంటి రాష్ట్రాలు దిగుమతులను నిషేధిస్తున్నాయి. యాంటీబయోటిక్ మందులు వినియోగించడం లేదంటూ అక్కడ శాస్త్రవేత్తలను. అధికారులను రప్పించి క్షేత్ర స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇటువంటి ఇబ్బందులు లేకుండా

విద్యుత్ రాయితీపై ప్రభుత్వం స్పష్టత

ఉండాలంటే యాంటీబయోటిక్ వినియోగించకుండా రైతులను కట్టడి చేయడం, ఇతర ప్రయోజనాల కోసం ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేస్తోంది. గతంలోనే దీనిపై చర్యలు తీసుకున్నారు. రైతులందరూ ముందుకు రావడం లేదు.

13,000 కనెక్షన్లకు రాయితీ

జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దానిని ఈ ఏడాది 1.50 లక్షల ఎకరాలకు విస్తరించాలని జిల్లా అధికారులు ప్రణాళిక రచించారు. రిజిస్ట్రేషన్‌కు వచ్చేసరికి 48 వేల ఎకరాలకు మాత్రమే రైతులు ముందడుగు వేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పశ్చిమలో మొత్తం 26,000 మంది రైతులు ఆక్వా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 16,500 విద్యుత్ కనెక్షన్‌లున్నాయి. అందులో ఆక్వాజోన్ పరిధిలో ఉండే విద్యుత్ కనెక్షన్‌లకు మాత్రమే ప్రభుత్వం రూ.1.50 విద్యుత్ రాయితీ ఇస్తోంది. జోన్ పరిధిలో పది ఎకరాలకుపైగా ఉన్న రైతులకు రాయితీ ఇవ్వడం లేదు. నాన్‌జోన్ పరిధిలో చిన్న రైతులకు రాయితీ లేకుండా పోయింది. ఈ నిబంధనలతో జిల్లాలో 13,000 కనెక్షన్‌లకు రాయితీ అమలు జరుగుతోంది. మరో 3,500 కనెక్షన్‌లకు రాయితీ లేకుండా పోయింది. రిజిస్ట్రేషన్ చేసుకుంటే రైతులందరికి విద్యుత్ రాయితీ వర్తింపచేసేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మత్స్యశాఖ సైతం త్వరలోనే సర్వేకు ఉపక్రమించనుంది. రిజిస్ట్రేషన్ చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించనున్నారు.

నాన్ ఆక్వాజోన్ పరిస్థితి ఏమిటి ?

విద్యుత్ రాయితీ ఇవ్వాలంటే రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. నాన్ ఆక్వాజోన్‌లో రిజిస్ట్రేషన్‌లు జరిగే అవకాశం లేదు. జిల్లాలో అవకాశం ఉన్నచోట చెరువులు తవ్వుతున్నారు. ఆక్వా సాగువైపు మళ్లుతున్నారు. కేంద్రం జీఎస్టీ తగ్గించడంతో మేత ధరలు తగ్గాయి. ఈమేరకు మళ్లీ సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వరి నుంచి ఉద్యానవనం, ఆక్వా రంగంపై రైతులను మళ్లించేలా అధికారులు సైతం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సందర్భంలో నాన్ ఆక్వాజోన్ అంటూ పరిమితులు విధించడం రైతులకు ఇబ్బందికరంగా మారింది. నాన్ ఆక్వా జోన్‌లో రిజిస్ట్రేషన్‌లకు అవకాశం లేదు. అంటే రైతులకు విద్యుత్ రాయితీ వర్తించదు. అధికారులు ప్రణాళిక చేసినట్టు ఆక్వా రంగం విస్తరించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రభుత్వం జోన్‌పైనే ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే రైతులకు ప్రయోజనం ఉంటుంది. విద్యుత్ రాయితీ అందరికీ వర్తిస్తుంది. రిజిస్ట్రేషన్‌లు చేసుకోవడానికి రైతులందరూ ముందుకొస్తారు. లేదంటే గతంలో ఉన్న కనెక్షన్‌లకు విద్యుత్ రాయితీనుంచి తగ్గిపోనున్నాయి. రిజిస్ట్రేషన్‌లు తప్పనిసరితో ఇటువంటి సమస్యలు తలెత్తుతున్నాయి.

నేటి నుంచి మరో ఉచిత గ్యాస్ సిలిండర్

- జూలై 31లోగా బుక్ చేసుకుంటే మంజూరు
- మొదటి సిలిండర్ పొందలేని వారి సంఖ్య 80 వేలు పైనే ?



భీమవరంటౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రకటించిన ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంలో భాగంగా మంగళవారం నుంచి వచ్చే జూలై 31లోగా ఉచిత సిలిండర్ పొందే అవకాశం వచ్చింది. కూటమి ప్రభుత్వ హామీలో భాగంగా గత ఏడాది దీపావళి కానుకగా పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఉచిత గ్యాస్ పొందేందుకు జిల్లాలో 5 లక్షల 28 వేల మంది అర్హులుగా గుర్తించారు. ఇప్పటివరకు 4 లక్షల 36 వేల మంది ఇటీవల కాలంలో మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ పొందిన వారు ఉన్నారు. సోమవారం వరకు ఉచిత గ్యాస్ పొందలేని వారి సంఖ్య దాదాపు 80 వేలకు పైగా ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మార్చి 31తో ముగిసిన గడువు

మొదటి ఉచిత గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకునేందుకు మార్చి 31తో గడువు ముగిసింది. ఈమేరకు చాలా మంది వినియోగించుకోలేకపోయారనే ఆవేదన కనిపిస్తోంది. కొంతమంది ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించి అర్హత ఉన్నప్పటికీ వారికి మెసేజ్ రాని కారణంగా అర్హత లేదనే భావన ఉంది. ఉచిత గ్యాస్ రాకపోవడానికి సరైన కారణాలు ఇంతవరకు స్పష్టత లేకపోవడంతో మరికొంతమంది అర్హత ఉన్నప్పటికీ సిలిండర్ పొందలేకపోయారు.

నేటి నుంచి మరో సిలిండర్‌కు అవకాశం

ఏడాదికి మూడు సిలిండర్లకు సంబంధించి 2025-26 సంవత్సరానికి మొదటి సిలిండర్ పొందేందుకు ఈనెల ఒకటి నుంచి జూలై 31 వరకు గడువు ఉంది. ఈలోగా అర్హులైన లబ్ధిదారులు బుక్ చేసుకునే వెసులుబాటు ఉంది. రెండో సిలిండర్ వచ్చే ఆగస్టు నుంచి నాలుగు నెలల్లోపు బుక్ చేసుకోవచ్చు.

'హైవే 165' డీపీఆర్ ఆమోదం

- సాంకేతిక ఇబ్బందుల పరిశీలన.. తదుపరి కేంద్ర క్యాబినెట్‌కు..
- రెండు నెలల వ్యవధిలో టెండర్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఆకివీడు- దిగమర్రు జాతీయ రహదారి 165 ప్రతిపాదనలకు కేంద్రం ఆమోదముద్ర వేసింది. నాలుగులైన్‌ల రహదారి నిర్మాణానికి రూ.2,400 కోట్లు అవసరం అవుతుందని రాష్ట్ర జాతీయ రహదారి అధికారులు కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. ఆకివీడు నుంచి ఉండి-కాళ్ల-భీమవరం రూరల్, వీరవాసరం, పాలకొల్లు రూరల్ మండలాల గ్రామాల మీదుగా దిగుమర్రు వరకు 45 కిలోమీటర్ల పొడవునా



జాతీయ రహదారిని నిర్మించనున్నారు. గతంలో కేంద్రం దీని కోసమే రూ.1200 కోట్లు కేటాయించింది. అప్పట్లో రెండు లైన్‌ల రహదారికి మాత్రమే డీపీఆర్ వెళ్లింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత. కాళ్ల- భీమవరం రూరల్ మండలాల మీదుగా రహదారి వెళ్లేలా నాలుగు లైన్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బడ్జెట్ రెండింతలైంది. మార్చి 31లోగా ఆమోదం పొందితేనే గతంలో కేటాయించిన రూ.1200 కోట్లు అందుబాటులో ఉంటాయి. దీనిపై జిల్లా

నాలుగు లైన్ల రహదారికి రూ.2,400 కోట్లు అవసరం

ప్రజాప్రతినిధులు, ప్రజల్లోనూ ఉత్కంఠ నెలకొంది. కేంద్రం డీపీఆర్‌కు ప్రతిపాదనలకు ఆదివారం ఆమోదముద్ర వేసింది. ఈమేరకు డీపీఆర్‌కు పరిపాలనపరమైన చిక్కులు తొలగిపోయాయి. సాంకేతిక అనుమతులు మంజూరు చేయాల్సి ఉంది. రాష్ట్ర జాతీయ రహదారి అధికారులు పంపిన ప్రతిపాదనల్లో సాంకేతిక ఇబ్బందులుంటే మార్పులు, చేర్పులు చేస్తారు. ఆ తర్వాత కేంద్ర మంత్రిమండలి ఆమోదానికి పంపుతారు. దీనికోసం రెండు నెలల వ్యవధి అవసరం అవుతుంది. కేంద్ర మంత్రిమండలి ఆమోదించిన తర్వాత టెండర్‌లు పిలవనున్నారు. ఖరారైన తర్వాత పనులు ప్రారంభిస్తారు. వచ్చే ఏడాదిలోనే జాతీయ రహదారి నిర్మాణాన్ని ఒక కొలిక్కి తీసుకురావాడానికి జిల్లా అధికారులు ప్రణాళిక రచించారు. జిల్లా 2025-26 వార్షిక ప్రణాళికలో ఇదే జాతీయ రహదారిని ప్రస్తావించారు. కేంద్రం సైతం డీపీఆర్ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది.

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో వరి, ఇతర పంటల సమస్యలు, భూసార పరీక్షలు, రాయితీ పరికరాలు, ధాన్యం కొనుగోలు, సాగులో సమస్యలు వంటి వాటిపై ఈనెల 2వ తేదీ బుధవారం ఉదయం 10-11 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. రైతులు **94406 25154** నెంబరుకు ఫోన్ చేసి భీమవరం వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వరరావుకు సమస్యలను వివరిస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

చికెన్ @ 300

భారీగా పెరిగిన చికెన్ ధరలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు భారీగా పెరిగాయి. మొన్నటివరకు బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ కొనుగోలుకు మాంసం ప్రియులు ఆసక్తి చూపకపోవడంతో చికెన్ ధరలు రూ.200కు దిగువకు పడిపోయాయి. తాజాగా అదే చికెన్ ధరలు అమాంతం వంద రూపాయలు పెరిగి రూ.300కు చేరింది. ప్రస్తుతం చికెన్ వినియోగం గాడిన పడడం, ఉగాది, రంజాన్ వేడుకల్లో చికెన్ విక్రయాలు భారీగా పెరిగాయి. డిమాండ్‌కు తగ్గ బ్రాయిలర్ కోళ్లు అందుబాటులో లేకపోవడం తదితర కారణాలతో చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. నిన్నటివరకు బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ తినలేకపోయిన వారు ధరల మంటతో కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు.

బ్రాయిలర్‌కే డిమాండ్

చికెన్‌లో ఇటు బ్రాయిలర్, ఫారం కోళ్లు ఉండగా ఎక్కువగా బ్రాయిలర్ కోళ్లకే డిమాండ్ ఏర్పడింది. ఒక వైపు బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు తినడం తగ్గించే సరికి కోళ్ల విక్రయాలు ఎప్పటికి మెరుగుపడతాయో తెలియక బ్రాయిలర్ రైతులు కోళ్ల పెంపకం తగ్గించేశారు. రైతుల వద్ద కోళ్లు లేకపోవడంతో కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి ధరల నిర్ణయం వెళ్లిపోయింది. ఫారం కోళ్ల ధరలు మాత్రం అలానే ఉన్నాయి. ప్రస్తుతం ఫారం కోడి లైవ్ కేజీ రూ.70 ఉండగా మాంసం రూ. 130-150 వరకు విక్రయిస్తున్నారు. ఈ ధరల వ్యత్యాసం కేజీకి రూ.150 నుంచి రూ.170 వరకూ బ్రాయిలర్, ఫారం కోళ్ల మాంసం ధరల్లో కనిపిస్తోంది.

పది టన్నులపైనే విక్రయాలు

చికెన్ విక్రయాలు ఆదివారం ఉగాది, సోమవారం రంజాన్ పండుగల సందర్భంగా చికెన్ వినియోగం పెరిగింది. బర్డ్‌ఫ్లూ సమయంలో వారానికి చికెన్ విక్రయాలు టన్నుకు కూడా చేరుకోలేక ఇబ్బంది పడగా ప్రస్తుతం రెండు రోజులు కలిపి జిల్లాలో పది టన్నులు దాటి ఉండవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.



పరుపుల కంపెనీలో అగ్ని ప్రమాదం

రూ.20 లక్షలపైనే ఆస్తి నష్టం

నరసాపురం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోకావారిపాలెంలోని పరుపులు, సోఫాల తయారీ కంపెనీలో సోమవారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి కంపెనీలోని మిషనరీ, మెటీరియల్ ఆహుతయ్యాయి. తయారీ కేంద్రానికి సమీపంలో మూడు అంతస్తుల పైభాగంలోకి వ్యాపించడంతో ఆ ఇంటిలోని సామగ్రి బూడిదయ్యాయి. ప్రజలు భయంతో ఇళ్లల్లోంచి బయటకు పరుగులు తీశారు. పొగ వ్యాపించడంతో పరిసరాల్లో ఏమి కనిపించని పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న ఫైర్ అధికారి భాస్కర్‌రామన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఆస్తినష్టం రూ.20 లక్షలపైనే ఉండొచ్చని అంచనా వేశారు. మిషన్లు పూర్తిగా బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ విప్ నాయకర్, టీడీపీ ఇన్‌చార్జి రామరాజు ఘటనా ప్రదేశానికి చేరుకుని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



పరుపుల తయారీ కంపెనీలో ఎగిసిపడుతున్న మంటలు



శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ద్వారకాతిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశుని ఆలయాన్ని బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ప్రముఖ క్షేత్రాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు జరిపినట్లు బృంద సభ్యులు జి.సురేష్, టి.రాటాలు, డాగ్ హాండ్లర్ రాజు తెలిపారు. ఆలయ పరిసరాలు, గోపురాలు, అనివేటి మండప ప్రాంతం, ప్రసాదాల కౌంటర్లు, భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే ఇతర ప్రదేశాలలో బుల్లెట్ పేరుతో పిలిచే డాగ్‌తో ఈ తనిఖీలు చేపట్టారు.



ద్వారకాతిరుమల శివారు లక్ష్మీపురంలోని పురాతన ఆలయంలో స్వామి, పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను తాకిన సూర్యకిరణాలు

శ్రీనివాసుని తాకిన రవి కిరణాలు

ద్వారకాతిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సాయం సంధ్యవేళ భానుడి కిరణాలు గర్భాలయంలో కొలువైన శ్రీనివాసుని అపాదమస్తకం స్పృశించే శుభసమయంలో వీక్షించిన భక్తులు ఆనంద పారవశ్యంలో మునిగారు. ఏటా చైత్ర మాసం ప్రారంభ రోజుల్లో సాక్షాత్కరించే ఈ అరుదైన ఘట్టం పురాతన దేవాలయమై, శ్రీవారి క్షేత్ర దత్తత దేవాలయమైన లక్ష్మీపురం జగన్నాథ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం ఆవిష్కృతమైంది. సూర్య కిరణాలు నేరుగా స్వామివారిని పూర్తిగా స్పృశించి అనంతరం పాదాల వద్దనున్న ఉత్సవ మూర్తులను తాకి తర్వాత చాలా సేపటికి రెండుగా చీలి పద్మావతి, ఆండాళ్ అమ్మవార్లను తాకడం ఇక్కడి విశిష్టతగా చెప్పొచ్చు. ఆలయం ముందు చెట్లు, ధ్వజస్తంభం, పందిళ్లు ఉన్నా వాటిని తప్పించుకుని కిరణాలు లోనికి ప్రవేశించడం పలువురిని ఆశ్చర్య చకితుల్ని చేసింది.

ఆకట్టుకున్న ఉగాది నాటక పోటీలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రంలో 32వ ఉగాది నాటక పోటీలు ఆకట్టుకున్నాయి. తొలిరోజు ఆదివారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ఏలూరు హేళాపురం కల్చరల్ అసోసియేషన్ భారతీయ వైవాహిక వ్యవస్థ గొప్పతనం చాటే విధంగా 'సారీ రాంగ్ నెంబర్' నాటిక అబ్బుర పరిచింది. హైద్రాబాద్ విశ్వ శాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'స్వేచ్ఛ' నాటిక అందరినీ ఆలోచింప చేసింది.. ముందుగా స్టాంప్స్ రిజిస్ట్రేషన్ డీఐజీ డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది పడాల రవిలను బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల రామారావు సత్కరించి ఉగాది విశిష్ట సేవా పురస్కారాలు అందించారు.



సారీ రాంగ్ నంబర్ నాటికలో ఓ సన్నివేశం

డాక్టర్ జగదీష్‌కు విశ్వ వైద్య దివ్యాంగ బంధు అవార్డు

ద్వారకాతిరుమల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్, ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ గుడారు జగదీష్ విశ్వవైద్య దివ్యాంగ బంధు అవార్డు అందుకున్నారు. మారిషస్ తెలుగు మహాసభ ఆధ్వర్యంలో ఫీనిక్స్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ మారిషస్ ప్రధాన మంత్రి డాక్టర్ నవీన్‌చంద్ర రామ్ గులామ్ నుంచి ఈ అవార్డు పొందారు. నాలుగు దశాబ్దాలుగా దివ్యాంగుల శ్రేయస్సుకు తపిస్తున్న ఆయన దేశ, విదేశాలలో ఎన్నో ఉచిత క్యాంపులు నిర్వహించి ఎంతో కీర్తి సాధించారని పలువురు కొనియాడారు.



మారిషస్ ప్రధానమంత్రి నవీన్ చంద్ర నుంచి అవార్డు అందుకుంటున్న ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీష్

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

ఏలూరు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం సీతారామచంద్రుల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీన ఏలూరు నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రజా రవాణా శాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. ఈనెల 5వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 7 గంటలకు ఈ బస్సు సర్వీసులు ఉంటాయని భక్తుల సౌకర్యార్థం రిజర్వేషన్లు ప్రారంభించామని, టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా కూడా పొందవచ్చునన్నారు. ఒకే ఊరి నుంచి 40 లేదా 50 మంది భక్తులు భద్రాద్రికి వెళ్లాలనుకుంటే వారి సౌకర్యార్థం వారి ఊరు నుంచి రానుపోను ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని తెలిపారు. భక్తుల రద్దీని బట్టి ఎన్ని బస్సులు అయినా ఏర్పాటు చేయ నున్నట్లు తెలిపారు.

జగన్నాథస్వామి ఆలయంలో ఒరిగిన బలరాముడి విగ్రహం

600 ఏళ్ల క్రితం మొగల్తూరు రాజ వంశీకుల ఏర్పాటు

రెండేళ్లుగా విగ్రహం శిథిలావస్థకు.. ఇటీవల ఉన్నతాధికారుల పరిశీలన

నరసాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణంలో ప్రసిద్ధిగాంచిన జగన్నాథస్వామి ఆలయంలో సోమవారం బలరాముడి మూల విరాట్ చెక్క విగ్రహం శిథిలావస్థకు చేరి కొద్దిగా పక్కకు ఒరిగింది. మిగిలిన సుభద్ర, జగన్నాథుడి విగ్రహాలు చెక్కు చెదర లేదు. 600 ఏళ్ల క్రితం మొగల్తూరు రాజవంశీకులు ఈ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం బలరాముడి విగ్రహం కింద భాగంలో డొల్ల ఏర్పడింది. విషయాన్ని ఆలయ సిబ్బంది ఉన్నతాధికారులకు నివేదించారు. ఇటీవల డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారి ఈ విగ్రహాలను తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదించారు. సోమవారం బలరాముడి విగ్రహం కొద్దిగా ఒరగడాన్ని భక్తులు గుర్తించారు. విషయాన్ని వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆలయ ఈవో లోకేశ్వరావు మాట్లాడుతూ ఈ విగ్రహాలు ఏర్పాటు చేసి 600 ఏళ్లపైనే అయిందని, చెక్కతో తయారు చేసినవి కావడంతో ఇటీవల బలరాముడి మూల విరాట్ విగ్రహం అడుగు భాగంలో కొద్దిగా డొల్ల ఏర్పడింది. విషయాన్ని అధికారులకు నివేదించాం. ఉన్నతాధికారులు కూడా ఇటీవల విగ్రహాలను పరిశీలించారు. కాగా జిల్లాలో ఏకైక జగన్నాథస్వామి ఆలయం ఇదే కావడం గమనార్హం.



ఆలయంలోని జగన్నాథ, సుభద్ర, బలరాముడు మూల విరాట్‌లు

రహదారులకు మహర్దశ

(ఏలూరు,/భీమవరం-ఆంధ్రజ్యోతి): మార్చి 31: వైసీపీ జమానాలో నానాటికీ తీసికట్టుగా మారిన రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రహదారులకు ఇప్పుడు మహర్దశ పట్టనుంది. తొలి విడతగా గుంతల్లేని రహదారులుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పలు పనులను రాష్ట్ర సర్కార్ పూర్తిచేసింది. సంక్రాంతి నాటికే దాదాపుగా ఇవి పూర్తి చేశారు. గతంలో దారుణాతిదారుణంగా గుంతలు తేలిన రోడ్లను పూడ్చటానికి వీల్లేని వాటిని సీ-కేటగిరి కింద తీసుకుని ఆయా రీచ్‌ల వద్ద పూర్తి మరమ్మతులు, అభివృద్ధి చేయడానికి గత నవంబర్‌లో రెండు జిల్లాల అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా 24 రోడ్లకు రూ.42 కోట్ల 22 లక్షలతో పరిపాలనా ఆమోదం ఇచ్చింది.. ఇప్పుడు ఆ రోడ్లను పూర్తి చేయడానికి వేగంగా అడుగులు వేయనున్నారు.

ఏయే రోడ్లు బాగు చేస్తారంటే..

పలు నియోజకవర్గాల్లో రోడ్లపైన రాకపోకలు సాగించే ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ప్రత్యక్ష నరకం చవి చూశారు. వారి బాధలకు మోక్షం కల్పిస్తూ ఈ రోడ్లును పూర్తిగా అభివృద్ధి చేస్తారు. ఇందులో దెందులూరు నియోజకవర్గంలోని ఏలూరు రూరల్ మండలం కొల్లేరు పరిధిలో కోటేశ్వరదుర్గాపురం నుంచి పైడిచింతపాడు వయా కొక్కిరాయలంక వరకు దాదాపుగా 6.9 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధికి రూ.2 కోట్ల 5 లక్షలతో గ్రావెల్ రోడ్డుస్థానంలో బీటీ వేయనున్నారు. ఇది వరదలు, వర్షాలతో పూర్తి సర్వనాశనం అయ్యింది. ఇదే రోడ్డు నుంచి డీపీ రోడ్డు వయా ముండూరు నుంచి మేదినరావుపాలెం 3.80 కిలోమీటర్ల నిడివి కలిగిన రోడ్డుకు రూ.కోటి 50 లక్షలు కైకలూరు నియోజకవర్గంలో ఉప్పరగూడెం నుంచి విశ్వనాద్రిపాలెం వరకు 2.55 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ. కోటీ 20 లక్షలు, స్పెషల్ రిపేర్లు కింద వెస్ట్ విప్పర్రు నుంచి గుణపర్రు వరకు 4.94 కి.మీ రూ.కోటీ 50 లక్షలు, పశ్చిమ గోదావరి జిల్లాలోని ఉండి నియోజకవర్గంలో వాండ్రం నుంచి సీసలి 2 కిలోమీటర్ల రోడ్డుకు 2 కోట్ల 65 లక్షలు, తణుకు నియోజకవర్గంలోని ఉరదాళ్లపాలెం నుంచి దువ్వ వరకు 8.80 కిలోమీటర్ల రోడ్డుకు 3 కోట్ల 50 లక్షలు మంజూరు చేశారు.

సి-కేటగిరీ కింద మరమ్మతులు, అభివృద్ధికి రూ.42.22 కోట్లు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 24 రోడ్లకు మోక్షం

రాష్ట్ర హైవే రోడ్ల అనుసంధానం

ఉమ్మడి జిల్లాల్లో 11 ప్రధాన రహదారులుండేవి. ఒక మండల నుంచి మరో మండలం అనుసంధానంతో పాటు రాష్ట్ర హైవేకు కలిపే రోడ్లు కూడా జిల్లాలో దారుణంగా తయారయ్యాయి. పూర్తిగా దెబ్బతిన్న రోడ్లపై లేయర్లను వేసి ఇతర రోడ్లకు సమాంతరంగా వీటిని తీర్చిదిద్దనున్నారు.

రెండు జిల్లాల పరిధిలో చింతలపూడి నియోజకవర్గంలో నర్సాపురం నుంచి అశ్వారావుపేట 0.99 కిలోమీటర్లకు రూ.80 లక్షలు, చేబ్రోలు- దేవులపల్లి రోడ్డు 2.17 కిమీకు 70 లక్షలు, చింతలపూడి- రావికంపాడు 4 కిలోమీటర్ల రోడ్డుకు రూ.2 కోట్లు, పోలవరం నియోజకవర్గంలో యర్నగూడెం నుంచి పొంగుటూరు వరకు 1.20 కి.మీకు రూ.40 లక్షలు, పోలవరం నుంచి కొయ్యలగూడెం 7.60 కిమీకి రూ.3 కోట్ల 40 లక్షలు, చింతలపూడి - రావికంపాడు రోడ్డు 10 కిలోమీటర్లకు 4 కోట్ల 22 లక్షలు, ఏలూరు నియోజకవర్గంలో ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే రోడ్డు 2 కిలోమీటర్లకు కోటి రూపాయలు, ఏలూరు నగరంలోని సీసీ రోడ్డు నూజివీడు- నుంచి ఏలూరు రోడ్డు 45 మీటర్లకు 90 లక్షలు, కైకలూరులో వడాలి నుంచి తాడినాడ రోడ్డు 5 కి.మీకు రూ.2 కోట్లు, దెందులూరు నియోజకవర్గంలో నూజివీడు- ఏలూరు రోడ్డు 1.20 కిలోమీటరు నిడివి గల రోడ్డురూ.60 లక్షలు, నూజివీడు నియోజకవర్గంలోని నూజివీడు- గన్నవరం రోడ్డు ఇంప్రూవ్‌మెంట్‌కు 5.40 కిలోమీటర్లకు 2 కోట్ల 50 లక్షలు, అడవి నెక్కలం నుంచి వెలవాదం రోడ్డు 9 కిలోమీటర్లకు 3 కోట్లు, ఉంగుటూరులో భీమడోలు- కామవరపుకోట పాతరోడ్డు ఇంప్రూవ్‌మెంట్ 1.8 కి.మీకు 2 కోట్లు మంజూరు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని జిల్లాలో భీమవరం, ఉండి, పాలకొల్లు, ఆచంట, తణుకు నియోజకవర్గాల పరిధిలో రహదారులకు రూ.6.15 కోట్లు కేటాయించారు. తణుకులో మార్టేరు- ప్రత్తిలంక 5.90 కి.మీకు 3 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నరసాపురం-అశ్వారావుపేట 2.50 కోట్లు, పాలకొల్లులో పాలకొల్లు -దొడ్డిపట్ల రోడ్డు 11.60 కి.మీ మేర రూ.5 కోట్లు, ఆచంట నియోజక వర్గంలో పాలకొల్లు-ఆచంట రోడ్డు 1.50 కి.మీలకు కోటీ 50 లక్షలు, పెనుమంట్ర- వీరవాసరం1.50 కోట్లు పనులు చేసేందుకు పరిపాలనామోదం ఇచ్చారు.



ఏలూరు నుంచి కైకలూరు వెళ్లే రోడ్డు



ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం

స్టీల్‌ప్లాంట్ బలోపేతానికి కృషి చెయ్యండి

భీమవరం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం, బలోపేతానికి కృషి చెయ్యాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వశాఖ ప్రతినిధి బృందం, కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మలతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిపారు. వర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న 2వ బ్లాస్ట్ ఫర్నేస్‌లతో పాటు, 3 వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని వివరించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పూర్వ వైభవానికి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని చెప్పారు. ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్‌చార్జి ఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కే వర్మ, ఎంఎస్టీసీ లిమిటెడ్ సీఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.



మేడపాడులో గ్రావెల్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్

కాలువల వెంబడి రహదారుల అభివృద్ధి : మంత్రి నిమ్మల

యలమంచిలి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రైతులు తాము పండించిన ధాన్యాన్ని తరలించు కోవడానికి ఉపయోగపడే 100 గ్రావెల్ రోడ్లను నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్టు రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. మండలంలోని అడవిపాలెం, మేడపాడు గ్రామాల్లో రూ.1.15 కోట్ల నిధులతో చేపట్టనున్న రైతులకు ఉపయోగపడే నాలుగు గ్రావెల్ రోడ్ల నిర్మాణపనులకు మంత్రి రామానాయుడు సోమవారం శంకుస్థాపనలు చేసి, శిలా ఫలకాలను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలతో పాటూ రైతులను, వ్యవసాయాన్ని గాలికొదిలేశారని, ఎన్డీఏ ప్రభుత్వంలో రైతులకు పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారధ్యంలో సాగునీటి వ్యవస్థను గాడిలో పెడుతున్నామన్నారు. వచ్చే ఖరీఫ్‌కు ముందే అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ రూ.20 వేలు అందజేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మామిడి శెట్టి పెద్దిరాజు, బోనం నాని, చిలుకూరి బాలాజీ, చల్లా నరేంద్ర కుమార్, నడింపల్లి నరేష్‌కుమార్‌రాజు, బొప్పన హరికిషోర్, ఆరుమిల్లి చిన్ని పాల్గొన్నారు.



హైదరాబాద్ రవీంద్రభారతిలో కిన్నెరసాని ఆర్ట్ థియేటర్స్ వారు నిర్వహించిన విశ్వావసు నామ ఉగాది కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి గౌరవ పురస్కారం అందుకుంటున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ తేతలి దశరథరామారెడ్డి



భరతనాట్యంలో చిన్నారులకు అవార్డులు

పోడూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సోమవారం నిర్వహించిన ఉగాది బాల- 2025 భారతీయ నృత్యోత్సవంలో పాల్గొన్న పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన చిన్నారులు రేమెళ్ల మనోజ్ఞ, ఇళ్ల జాహ్నవి, సత్తి హరినాగశ్రీ, వీరవల్లి యశస్విని భరతనాట్య అరంగేట్రం చేసి తొలి ప్రదర్శనలోనే ఆహుతులను మెప్పించారు. వీరికి నర్తన వసంత కుసుమం అవార్డులను బహూకరించారు. ఎమ్మెల్యే పితాని సత్య నారాయణ చిన్నారులను అభినందించారు.

బాలికపై అత్యాచారయత్నం.. పోక్సో కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బాలికకు మాయమాటలు చెప్పి అత్యాచారయత్నం చేసిన ఘటనపై ఓ వ్యక్తిపై తాడేపల్లిగూడెం పట్టణ పోలీసు స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కడకట్లకు చెందిన నాగరాజు ఇటుకల బట్టీలో పనిచేస్తుంటాడు. అతనికి వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. రెండురోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికకు మాయ మాటలు చెప్పి వారి ఇంటి సమీపంలో అత్యాచారయత్నానికి పాల్పడగా మేనమామ చూసి కేకలు వేయగా నాగరాజు పరారయ్యాడు. బాలికతో పాటు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

క్రైమ్ కార్నర్

మహిళా ఖైదీ మృతదేహం అప్పగింత

ఏలూరు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జైలులో బ్యారక్‌లోని కిటికీకి చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన రిమాండ్ ఖైదీ గంధం శాంతకుమారి మృతదేహానికి సోమవారం ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని ఆమె తల్లి కుమారికి అప్పగించారు. జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం గ్రామానికి చెందిన గంధం శాంతకుమారి (31) ఆమె భర్త బోసును ఆమె ప్రియుడు గోపాలరావుతో కలిసి హత మార్చిందనే ఆరోపణపై అరెస్టు అయి మార్చి 24న ఏలూరు జిల్లా జైలుకు రిమాండ్ ఖైదీగా వచ్చింది. ఆమె కుటుంబ సభ్యులు ఈనెల 29వ తేదీన కలిశారు. ఆమె ఏమను కుందో ఏమిటో కాని ఈనెల 30వ తేదీ ఉదయం 7.30 గంటల సమయంలో బ్యారక్‌లోని రిమాండ్ ఖైదీలందరు టిఫిన్ చేయడానికి రాగా ఆమె కూడా బయటకు వచ్చి వాష్‌రూము అని చెప్పి లోపలకు వెళ్లి బ్యారక్ కిటికికి తన చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన జైలు సిబ్బంది ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసురాగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై జైలు సూపరింటెండెంట్ స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ విచారణ చేపట్టారు. మృత దేహానికి సోమవారం పోస్టుమార్టం నిర్వహించి తాటియాకులగూడేనికి మృత దేహాన్ని తీసుకువెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

భీమవరం క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు వంతెన సమీపంలోని రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వీధి సోమాలమ్మ (80) మృతి చెందింది. పట్టణంలోని 38వ వార్డు లంకపేటకు చెందిన సోమాలమ్మ శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చి రోడ్ల వెంబడి తిరుగుతుండగా సోమవారం రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందింది. వీఆర్‌వో టి.వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్ఐ కె.శ్రీనివాస్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

భీమవరం క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఒక యువకుడిని మరో ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. తాడేపల్లిగూడేనికి చెందిన పసుపులేటి భార్గవ కళ్యాణ తేజ్ అనే యువకుడు ఈ నెల 30వ తేదీ రాత్రి 10.30 గంటలకు తాడేపల్లిగూడెంలో బయలుదేరి భీమవరం వారి బంధువుల ఇంటికి వస్తున్నాడు. రాత్రి 12 గంటల సమయంలో రాయలం ఆర్చి వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సమాచారం మేరకు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

ఓయో ప్రతినిధులపై చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఒప్పందం ప్రకారం సొమ్ములను చెల్లించకపోవడంతో ఓయో ప్రతినిధులపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదు చేశారు. ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని గ్రాండ్ ఆర్యా త్రిస్టార్ హోటల్‌ను బొల్లి వీర రాఘవయ్య చౌదరి నిర్వహిస్తున్నారు. ఆయనతో ఓయో సంస్థ ప్రతినిధులు ఆ హోటల్‌లో రూములు తాము బుక్ చేస్తామని అందుకు ఒప్పందం ప్రకారం సొమ్ములను ఇస్తామంటూ 2024లో ఒప్పందం చేసుకున్నారు. హోటల్‌లో ఓయో వద్ద బుక్ చేసుకున్న కస్టమర్లకు గ్రాండ్ ఆర్యా హోటల్‌లో రూములను రాఘవయ్య చౌదరి ఇస్తున్నారు. అందుకు సంబంధించిన సొమ్ములను ఇవ్వడం లేదని ఓయో ప్రతినిధులైన రవితేజ (విశాఖపట్టణం), ఉమేష్ (హైదరాబాద్), పృథ్వి (విజయవాడ), నవీన్ (విశాఖపట్టణం), సుధాకర్ (విజయవాడ)లపై సోమవారం చీటింగ్ కేసు నమోదు చేశారు.



మృతి చెందిన రాజ్‌కుమార్ (ఫైల్)..మహిళ ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న మృతుని కుటుంబీకులు

అంకన్నగూడెంలో యువకుడి ఆత్మహత్య

మహిళతో వివాహేతర సంబంధం

యువకుడి మృతి విషయం తెలిసి పురుగుల మందు తాగిన మహిళ

జీలుగుమిల్లి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : అంకన్నగూడెంలో వ్యక్తి పురుగుల మందు తాగి విజయవాడ ఆస్పత్రిలో వైద్యం పొందుతూ సోమవారం మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన శ్రీరాముల రాజ్ కుమార్ (23) గ్రామంలో ఓ మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసిన మహిళ బంధువులు, ఆమె భర్త అతడిని చంపుతామని పలు మార్లు బెదిరించారు. తనకు ప్రాణహాని ఉందని తనకు రక్షణ కల్పించాలని ఇటీవల మార్చి 28న జీలుగుమిల్లి పోలీస్‌లకు రాజ్ కుమార్ ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గ్రామపెద్దలు జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించేందుకు సిద్ధమయ్యారు. ఈలోపే రెండు రోజుల క్రితం రాజ్‌కుమార్ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు.ఆస్పత్రి పాలయ్యాడు. పరిస్థితి విష మించడంతో వైద్యం పొందుతూ సోమవారం విజయవాడలో మృతి చెందాడు.ఈ విషయమై హెడ్ కానిస్టేబుల్ పి.రాధాకృష్ణ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వ హించి బంధువులకు అప్పగించారు.

మృతుడి బంధువుల ఆందోళన

అంకన్నగూడెంలో మృతుడు రాజ్‌కుమార్ కుటుంబీకులు మహిళ ఇంటిపై దౌర్జన్యానికి దిగారు. రాజ్‌కుమార్ మృతికి మహిళ కుటుంబీకుల బెదిరింపులే కారణమని మండి పడ్డారు. సమస్య పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించలేక పోయారని ఆందోళనకు దిగారు. మృత దేహంతో మహిళ ఇంటి వద్ద ఆందోళన చేశారు. ఇదిలా ఉంటే రాజ్‌కుమార్‌తో సంబంధం కలిగిన మహిళ సోమవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. ఆమెకు రాచన్నగూడెం పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం జంగారెడ్డిగూడెం తరలించారు.

ఆంధ్రజ్యోతి
భీమవరం
భీమవరం, ఉండి, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు, తాడేపల్లిగూడెం
8 www.andhrajyothy.com ● మంగళవారం 1 ఏప్రిల్ 2025

జోరుగా రిజిస్ట్రేషన్లు

ఆచంట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సోమవారం రంజాన్ సెలవు అయినప్పటికి ప్రభుత్వ ఆదేశాలు మేరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు యధావిధిగా పని చేశాయి. జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సంబంధించి సుమారు 100 రిజిస్ట్రేషన్‌లు జరిగినట్లు సమాచారం. బ్యాంక్‌లకు సెలవు అయినప్పటికి పలువురు కక్షిదారులు చలానాలు ఆన్‌లైన్‌లో కట్టి రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవడం విశేషం.

'చేనేత వస్త్రాలు ఆరోగ్యానికి మేలు'

భీమవరం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) చేనేత వస్త్రాలు ఆరోగ్యానికి మేలని సంఘ సేవకుడు రంగసాయి అన్నారు. చేనేత వస్త్రాల వాడకంపై ఇంటింటికి ప్రచార భేరి శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాస్ చేనేత వస్త్రాలను వాడాలని పిలుపునిచ్చారు. ఆప్కో మేనేజర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రం ఈ ఏడాది 30 శాతం డిస్కౌంట్ ఇస్తోందన్నారు.


రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ఆరిమిల్లి


తాడేపల్లిగూడెంలో ప్రార్థనలు


గరగపర్రులో ముస్లిం సోదరుల ఈద్ ముబారక్


పెంటపాడులో పాయసం పంపిణీ చేస్తున్న షేక్ ఖాజా

భక్తి శ్రద్ధలతో రంజాన్

» ప్రార్థనల్లో పాల్గొన్న పలువురు నాయకులు » తోఫా పంపిణీ

భీమవరం టౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పెద్ద మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అక్కడి నుంచి ప్రదర్శనగా నరసయ్య అగ్రహారంలోని సున్నీ జామియా ఈద్గాకు చేరుకున్నారు. యూపీ నుంచి విచ్చేసిన ముఫ్తీ ఫరమార్ ఆధ్వర్యంలో నమాజ్ నిర్వహించారు. భీమవరం ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ రబ్బాని, గౌరవాధ్యక్షుడు నౌషాద్, కార్యదర్శి ఎం.డి.షాబు, ఉపాధ్యక్షుడు షేక్ అన్సారి మాట్లాడుతూ అల్లా దయవల్ల ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పెద్ద మసీదు ఇమామ్ ఫీజ్ ఆలం మౌజీ, కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింల అభివృద్ధే ధ్యేయం: ఆరిమిల్లి

తణుకు: ముస్లింల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని కొమ్మాయి చెర్వు వద్ద ఈద్గాలో ముస్లిం సోదరులతో కలసి నమాజ్‌లో పాల్గొన్నారు. తణుకులో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పెంటపాడు: పెంటపాడు గేటు సెంటర్ వద్ద బిస్మిల్లా హోటల్ యజమాని షేక్ ఖాజా సుమారు 500 మందికి పాయసం పంపిణీ చేశారు. షేక్ అబ్దుల్లా, షేక్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణం, మండలంలో రంజాన్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్దమసీదులో ముస్లింలు వక్ఫ్‌బోర్డ్ బిల్లుకు నిరసనగా చేతికి నల్లరిబ్బన్ కట్టుకుని ప్రార్థనల్లో పాల్గొన్నారు. వీకర్స్ కాలనీ మసీదు ఆధ్వర్యంలో యర్రా నారాయణస్వామి మున్సిపల్ పాఠశాలలో పురుషులతో పాటు మహిళలు కూడా ప్రార్థనలో పాల్గొనేందుకు పరదా ఏర్పాటు చేసి మహిళలకు ప్రార్థనల్లో పాల్గొనే అవకాశం కల్పించారు.

ఇరగవరం: మండలంలో ముస్లిం సోదరులు సోమవారం రంజాన్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులను విద్యుద్దీపాలతో అలంకరించారు. రేలంగి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు, ఉపన్యాసాలు జరిగాయి.


భీమవరంలో తోఫాను పంపిణీ చేస్తున్న ఎస్పీ


రంజాన్ తోఫా అందజేస్తున్న షేక్ ధరమ్ మదీనా

నరసాపురం టౌన్: తీరంలో సోమవారం రంజాన్‌ను ముస్లిం సోదరులు సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. మిషన్ హైస్కూల్ రోడ్‌లోని ఈద్గాలో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఖాజీ ఇమ్రాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన్ను ముస్లీం పెద్దలు సత్కరించారు. విప్ నాయకర్, పొత్తూరి రామరాజుతో పాటు పలువురు నాయకులు, వ్యాపారులు ఈద్గా వద్దకు వెళ్లి ముస్లిం పెద్దలకు బొకేలిచ్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పాలకొల్లు అర్బన్: పరోపకారంతో నీతివంతంగా జీవితాన్ని గడపాలన్న సందేశాన్ని రంజాన్ ఇస్తుందని స్థానిక సున్నీ జామియా మసీదు ట్రస్టీ మహ్మద్ రఫీ అన్నారు. పట్టణంలోని ఈద్గాలో సోమవారం జరిగిన ప్రత్యేక రంజాన్ ప్రార్థనల్లో రఫీ ముఖ్య వక్తగా విచ్చేసి మాట్లాడారు. రైలు గేటు సమీపంలో షేక్ వల్లీ ముస్లీంలకు పాయసం అందజేశారు. 23వ వార్డులోని వాకర్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ కర్రా జయసరిత తన నివాసం వద్ద ముస్లిం మహిళలకు చీరలు, స్వీటు ప్యాకెట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

పెనుమంట్ర: మార్టేరులోని జామియా నూర్ మజీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా నూర్ మజీద్‌లో పోగొట్టు తాత సాహెబ్ అండ్ సన్స్ మసీద్ ప్రెసిడెంట్ షేక్ అబ్దుల్లా సుబాని ముస్లింలందరికీ రంజాన్ తోఫా అందించారు. జామియా నూర్ మసీద్ వైస్ ప్రెసిడెంట్ గౌస్ మొహుద్దీన్, సెక్రటరీ బాబ్జి, ట్రెజరీ ఎండి ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: ఈదుల్ ఫితర్‌ను ముస్లింలు ఘనంగా జరిపారు. సిద్ధాంతం, పెనుగొండ, ములపర్రు మసీదుల్లో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. ములపర్రులో మాల మహానాడు ఆచంట మండల అధ్యక్షుడురావి నాగరాజు ఆర్థిక సాయంతో మసీదుకు సంబంధించిన క్లాత్ అందజేయడానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ ముఖ్యఅతిధిగా విచ్చేశారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పాలకోడేరు: రంజాన్ దాతృత్వానికి ప్రతీక అని గరగపర్రు ఎంపీటీసీ, ముస్లిం పెద్ద షేక్ పాపా సాహెబ్ అన్నారు. గరగపర్రు లో ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో రంజాన్ విందు ఏర్పాటు చేశారు. మతాలకతీతంగా గ్రామపెద్దలను విందుకు ఆహ్వానించారు. వేంద్ర, శృంగవృక్షం, పెన్నాడ మసీదుల్లోను ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. షేక్ పాపా సాహెబ్, షేక్ అబ్దుల్లా, షేక్ లాల్ సాహెబ్, షేక్ బాషా, షేక్ మీరావలి, వలీఖాన్, సిద్ధిఖ్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉండి: చెరుకువాడలో ముస్లిం సోదరులు ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సేమియాను పంచిపెట్టారు.

ఆకివీడు: అన్వరీ మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలంటూ నలుపు రిబ్బన్ ధరించి నిరసనలు చేపట్టారు. వీరికి వామపక్షాల నేతలు మద్దతు తెలిపారు. కాగా ఇటీవల ముస్లింలు రెండు వర్గాలుగా ఏర్పడ్డాయి. సంఘానికి వస్తున్న నగదుకు లెక్కచూపాలంటూ ఒక వర్గం మరో వర్గాన్ని ప్రశ్నించడంతో మసీదు వద్ద గొడవలు జరగకుండా సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఐ హనుమంతు నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పాలకొల్లు రూరల్: దగ్గులూరులో ఆల్ మదీనా ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర దూదేకుల సంఘం ఉపాధ్యక్షుడు హాజీ షేక్ ధరమ్ మదీనా 500 మంది పేదలకు అన్నదానం చేశారు. కళాకారులను సన్మానించి బియ్యం, నిత్యవసర సరుకులును అందచేశారు. టీడీపీ మండల పరిషత్ ఫ్లోర్‌లీడర్ శాగా సత్యనారాయణ పాల్గొన్నారు.

గణపవరం: గణపవరం మసీదులో పెదగురువు అరమాన్ రజాక్ ఖదారి ఖురాన్ చదివి వినిపించారు. దాన ధర్మాలు జరిగాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. సెమియాను ముస్లింలతో పాటు హిందువులకు పంపిణీ చేశారు.

ఇంటర్వ్యూ..

ఎండ తగలకుండా టోపీ ధరించాలి

డాక్టర్ సీహెచ్‌వీ రంగం నాయుడు, పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యుడు



- **వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటి?**
  జవాబు: నీడ పట్టునే ఉండాలి. కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళితే టోపీ పెట్టుకోవాలి.
- **వడదెబ్బ లక్షణాలు ఏమిటి?**
  జవాబు: తలనొప్పి, తల తిరగడం, తీవ్ర జ్వరం, మత్తు నిద్ర, పిట్స్ రావడం, పూర్తి అపస్మారక స్థితి ఉంటుంది.
- **వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి?**
  జవాబు: వడదెబ్బ తగిలిన వారిని నీడ ప్రాంతంలో చల్లని గాలి తగిలేలా ఉంచాలి. తడిగుడ్డతో శరీరమంతా తుడుస్తూ ఉండాలి. వారు సాధారణ స్థితికి రాకపోతే వెంటనే ఆసుపత్రికి తరలించాలి.
- **వేసవిలో శీతల పానీయాలు తీసుకోవడం మంచిదేనా?**
  జవాబు:మంచిది కాదు. నిమ్మరసం, బత్తాయి రసం, మజ్జిగ తీసుకోవడం మంచిది.

(ఆంధ్రజ్యోతి-పాలకోడేరు)



నెహ్రూకు పదోన్నతి

భీమవరం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార శాఖ భీమవరం కార్యాలయంలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్. శ్రీనివాస నెహ్రూకు ఆడియో విజువల్ సూపర్ వైజర్‌గా పదోన్నతి కల్పించి ఏలూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో సోమవారం భీమవరం కార్యాలయంలో విధుల నుంచి రిలీవ్ అయిన ఆయనకు డీపీఆర్‌ఓ టి.నాగేశ్వరావు సత్కరించారు. నెహ్రూ ఆడియో విజువల్ సూపర్‌వైజర్‌గా పదోన్నతి పొందడం పట్ల ఏపీఆర్ కె.సత్యనారాయణరాజు, రికార్డు అసిస్టెంట్ డి.సోమరాజు, ఫొటోగ్రాఫర్ పీవై రత్నాకర్, సిబ్బంది అభినందించారు.

రిటైర్డ్ హెచ్‌ఎం రామకృష్ణంరాజు మృతి

ఉండి, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఉండి గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు ముదునూరి రామకృష్ణంరాజు (86) సోమవారం ఉండిలోని తన ఇంటివద్దే మృతి చెందారు. ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకుని కోలుకుంటున్నారనుకునే సమయంలో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు వున్నారు. ఈయన కోడలు జ్యోత్స్న జడ్పీటీసీగా పని చేశారు. పలువురు ఉపాధ్యాయులు, నాయకులు ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

దాబాల్లోనే మద్యం : కొట్టు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ హామీలను అమలు చేసినప్పుడు కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేక పోతోందని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రశ్నించారు. తాడేపల్లిగూడెం లో దాబాల్లోనే మద్యం విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాడేపల్లిగూడెంలో పది నెలల్లో 12 హత్యలు జరిగాయని ఇదిలా అండర్ ఆర్డర్ గాడితప్పడం కాదా అని ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ సూర్పన రామకృష్ణ, వైసీపీ నాయకులు

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న సమ్మె

తణుకు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కార్మికులకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ మే20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. సోమవారం తణుకు సీపీఐ కార్యాలయంలో ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ 8 గంటల పని తీసేసి 10 గంటలు పెట్టడం, యూనియన్‌లు పెట్టుకునే, వేతనాలు అడిగే హక్కు లేకుండా చేయడం కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టడమే అన్నారు. ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సావారపు దేవి తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ వద్దు.. పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని, ప్రజలంతా తిప్పి కొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బి. బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దు బ్రోచర్లను సోమవారం పార్టీ కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. వీటిని ప్రతి ఇంటికి అంటిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు విధానం తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా నాయకులు బి. వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): క్రీడలు యువతలో మానసిక ఉల్లాసం కలిగించడంతో పాటు ఆరోగ్యకర జీవనానికి దోహదపడతాయని జనసేన యువనేత బొలిశెట్టి రాజేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ గ్రౌండ్ వద్ద సోమవారం బీసీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. నిర్వాహకులు చిన్న, కరీం, సలాం, నీలపాల దినేష్ తదితరులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ నిత్యాన్నదాన పథకానికి విరాళం



భీమవరంటౌన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మావుళ్ళమ్మ వారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పట్టణానికి చెందిన లక్ష్మీగణపతి హనుమంత రావు దంపతులు లక్షా నూట పదహారు రూపాయలు విరాళంగా అందజేశారు.

బంగారం బహూకరణ

మావుళ్ళమ్మ వారికి పట్టణానికి చెందిన విజయ్ వర్మ, ఫణి కుమార్ వర్మ 8 గ్రాములు, వెంకట నరసింహారావు 4 గ్రాములు బంగారం బహూకరించారు. ముందుగా దాతలు అమ్మవారిని దర్శించుకోగా అర్చకులు పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరఫున దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం ఫోటో అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పర్యవేక్షించారు.

జేపీ రోడ్డులో శ్రీవారికి...

భీమవరం జేపీ రోడ్డులోని శ్రీ పద్మావతి వేంకటేశ్వర స్వామి వారికి దాతలు బంగారం విరాళంగా అందించారు. సోమవారం రాయలంకు చెందిన వల్లభ రమేష్, లక్ష్మి కుమారి వారి కుమార్తె అనూష, కుమారుడు భార్గవ్ సాయి 8 గ్రాముల బంగారాన్ని విరాళంగా అందించారని ఆలయ చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. అనంతరం దాతలను సత్కరించారు.


విప్ నాయకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

బేడ, బుడగ వర్గీయుల హర్షం

నరసాపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం లో బేడ, బుడగ కులస్థుల్ని ఎస్సీ జాబితాలో చేరుస్తామని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడంపై ఆ వర్గీయులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పార్టీ కార్యాలయం వద్ద ప్రభుత్వ విప్ నాయకర్‌ను కలిసి సత్కరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. కుల పెద్దలు కుమార్ జయరాజు, నర్సింహస్వామి, దుర్గారావు, శ్రీను, బోడియ్య, చిన్న శ్రీను, ఏడుకొండలు పాల్గొన్నారు.



క్రైస్తవుల శాంతి ర్యాలీ

పెనుమంట్ర/ఉండి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల ప్రభుత్వం విచారణ వేగవంతం చేసి బాధ్యులను కఠినంగా శిక్షించాలని క్రిస్టియన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మార్టేరు సెంటర్‌లో భారీ శాంతి ర్యాలీ, మానవహారం నిర్మించారు. జేఏసీ నాయకు డు పలివెల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. పెనుమంట్ర, పెనుగొండ, పోడూరు, ఆచంట మండలాల క్రైస్తవులు, పాస్టర్లు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఉండిలోనూ శాంతి ర్యాలీ నిర్వహించారు.


మొగల్తూరులో మిషన్‌తో వరి కోతలు

మొదలైన దాళ్వా కోతలు

మొగల్తూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మొగల్తూరులో దాళ్వా కోతలు ప్రారంభించారు. మండలంలో 1900 ఎకరాల్లో సాగు చేపట్టాల్సి ఉండగా సాగు ఆరంభంలో వర్షాలు కురవడం, దర్భరేవు ముంపు ప్రభావంతో నారుమడులు కుళ్ళిపోవడం, కాలువల్లో నీరు సక్రమంగా అందకపోవడంతో 1,146 ఎకరాల్లో సాగు చేపట్టారు. ముందుగా ఊడ్చిన చేలు కోతకు రావడంతో మొగల్తూరు పంచాయతీ పరిధి ఇంజేటివారిపాలెంలో వరికోత యంత్రంతో దాళ్వా చేలు కోసి ధాన్యాన్ని రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. అధికంగా పురుగు మందులు, ఎలుకల బెడద నివారణకు ఎక్కువగా ఖర్చయిందని రైతులు వాపోయారు.


సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీధర్

పాలపర్తి శ్రీధర్‌కు కళారత్న అవార్డు ప్రదానం

పాలకొల్లు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 27వ వార్డుకు చెందిన పాలపర్తి శ్రీధర్‌ను కళారత్న అవార్డు వరించడం పట్ల ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో శ్రీధర్‌కు సీఎం చంద్రబాబు నాయుడు అవార్డును అందించారు. ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, బీసీ సంఘ నాయకుడు కాగిత సూర్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, మిత్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

పురోహిత సంఘం వార్షికోత్సవం

పాలకొల్లుఅర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీ గాయత్రి స్మార్త పురోహిత సంఘం 11వ వార్షికోత్సవం ఆదివారం రాత్రి లయన్స్ క్లబ్ హాల్లో జరిగింది. ఉదయం క్షీరా రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా సుదురుపాటి శ్రీనివాస శర్మ, ఉపాధ్యక్షులుగా త నికెళ్ళ శ్రీనివాస శర్మ, ప్రధాన కార్యదర్శిగా ఈరంకి కాశీ విశ్వనాథం శర్మ, కార్యదర్శిగా శివకోటి నాగేంద్ర కుమార్ శర్మ, కోశాధికారిగా శివకోటి గణేష్ శర్మ, కార్యవర్గ సభ్యులుగా పెండ్యాల రామారావు, పెండ్యాల సుబ్రహ్మణ్యం, భమిడిపాటి పవన్, ఆకెళ్ళ వెంకట రామ ఫణి శర్మలు, గౌరవ అధ్యక్షుడిగా గరిమెళ్ళ రాంబాబు శర్మ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శంభేశ్వర స్వామి ఆలయ ధర్మాధికారి గున్నేశ్వరరావును, సీనియర్ పురోహితులు పెండ్యాల రామారావు, గరిమెళ్ళ రవి కుమార్, పంచాంగ కర్త పిడపర్తి సత్యలక్ష్మీ కిరణ్‌ను సత్కరించారు. సంఘ నాయకులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్స్ జేఏసీ ఏకగ్రీవం

భీమవరం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సోమవారం భీమవరంలో జరిగిన డిజిటల్ అసిస్టెంట్స్ జిల్లా కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా అలీషా, జనరల్ సెక్రటరీగా వెంకటేష్, ట్రెజరర్‌గా ఆదిత్య, మహిళా విభాగం కార్యదర్శిగా అనూరాధ మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఆమోదించారు. అర్హులైన 277 డిజిటల్ సహాయకులను గణాంకాల శాఖలో విలీనం చేసే విధంగా రూపొందించిన కమిటీని ప్రభుత్వం కొద్ది రోజుల్లోనే రద్దు చేసిందని, ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించి కమిటీ పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కమిటీ కోరింది.

జనరల్ మర్చంట్స్ కార్యవర్గం

భీమవరం టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ది భీమవరం జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కమిటీ అయితా వెంటక కృష్ణారావు అధ్యక్షతన ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఏవీఆర్ సభాపతి, ఉపాధ్యక్షుడిగా తుమ్మలపెంట లక్ష్మి నారాయణ, కార్యదర్శిగా ఆర్‌వి ప్రసాదరావు, సహాయ కార్యదర్శిగా వబలిశెట్టి ప్రసాదరావు, కోశాధికారిగా సన్నిధి అచ్యుత రామయ్య ఎన్నికయ్యారు. ఛాంబర్ కార్యనిర్వాహక కార్యవర్గ సభ్యులుగా ఏవీఆర్ సభాపతి, గ్రంధి సత్య రవితేజ, ఆర్‌వీ ప్రసాదరావు, టి రంజిత్ కుమార్‌లను ప్రతిపాదించారు.


క్షీరారామంలో పూజలందుకున్న స్వామివారు


పంచలోహ విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు


ఆలయంలో ప్రతిష్ఠించిన కోటసత్తెమ్మ

క్షీరా రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

పాలకొల్లు అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): క్షీరారామంలో స్వామి వారికి సోమవారం సందర్భంగా రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. కోడిగట్టున ఉన్న శంకర మఠంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరునికి, 24వ వార్డు శంభన్న అగ్రహారంలోని శంభేశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు జరిగాయి.

శివాలయం లో ప్రత్యేక పూజలు

పెంటపాడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సోమవారం పెంటపాడు పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు సూర్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక అభిషేకాలు చేసారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోట్లమ్మకు ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలం దండగర్రలోని కోట్లమ్మ వారికి మహిళలు కుంకమ పూజలు నిర్వహించారు. తమ్మిశెట్టి బాబ్జీ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పంచలోహ విగ్రహం బహూకరణ

పాలకొల్లు అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక అచ్చుగట్లపాలెంలోని ముఖదారమ్మ జాతర రెండో రోజు సోమవారం వేడుకగా జరిగింది. సింహాద్రి వీరబ్రహ్మం దంపతులు 23 కిలోల అమ్మవారికి పంచలోహ విగ్రహాన్ని తయారు చేయించి, ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చి బహూకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బైనపాలెంలో ముత్యాలమ్మ జాతర

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్‌బీ చర్ల గ్రామంలో సోమవారం ముత్యాలమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. రాయపేటలోని పుంతలో ముసలమ్మ తల్లికి ఉగాది పురస్కరించుకుని సోమవారం రెండో రోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దండగర్ర, జగన్నాధపురం, ఆరుగొలను, కొత్తూరు, నవాబుపాలెం తదితర గ్రామాల నుంచి భక్తులు భారిగా పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కొత్తూరు కోలాట భజన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

కోటసత్తెమ్మ ఆలయం ప్రారంభం

పాలకొల్లు రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రూరల్ పంచాయతీ పరిధిలో హనుమాన్ నగర్‌లో దాతల సహకారంతో నిర్మించిన కోటసత్తెమ్మ ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని దాతలు దాసిరెడ్డి శ్రీను దంపతుల చేతులుమీదుగా ప్రతిష్ఠించారు. భక్తులకు అన్నసమారాధన జరిగింది.

2 నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

ఆకివీడు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక మాదివాడ కోదండ రామాలయ పునఃనిర్మాణం, విగ్రహ పునఃప్రతిష్ఠ జరగనున్నాయి. టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబు కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఏప్రిల్ 2 నుంచి ప్రత్యేక పూజలు, 6న కల్యాణం ఉంటుందని, ప్రముఖులు పాల్గొంటారన్నారు.

డస్ట్ బిన్నుల కొరత
రోడ్లపైనే చెత్త!

నరసాపురం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీలో చెత్త వేసే డంపర్ బీన్స్ కొరత నెలకొంది. దీంతో రోడ్లపైనే ఎక్కడ బడితే అక్కడ చెత్త దర్శనమిస్తోంది. కూడళ్ళల్లో పెద్ద పెద్ద కుప్పలు కనిపిస్తున్నాయి. గతంలో ఇలాంటి ప్రదేశాల్లో డంపర్ బిన్స్ ఉండేవి. చెత్త వ్యాన్లు రాని సమయంలో ప్రజలు వీటిలో చెత్తను వేసేవారు. ఇటు మార్కెట్‌లోని వ్యాపారులు, చిరు వ్యాపారులు తోపుడు బండ్లపై అల్పాహారం అమ్మే చిన్న చిన్న వ్యాపారులు కూడా సాయంత్రం చెత్తను ఈ బిన్స్‌లో పడేసేవారు. దీని వల్ల గతంలో ఎక్కడా చెత్త కనిపించేది కాదు. ఇలాంటి డస్ట్ బిన్నులు గతంలో 60 వరకు ఉండేవి. ప్రస్తుతం ఈ సంఖ్య 10కి పడిపోయింది. రెండేళ్ళ నుంచి పురపాలకం వీటిని కొనుగోలు చేయడం లేదు. పట్టణ పరిధిలోని 31 వార్డులు ఉన్నాయి. రోజుకు 30 టన్నుల పైనే చెత్త వస్తుంది. అయితే పురపాలకం పూర్తి స్థాయిలో చెత్తను సేకరించడం లేదు. గతంలో రోజూ ఇంటింటా చెత్త సేకరణ జరిగేది. ఇటీవల కాలంలో ఈ ప్రక్రియ సక్రమంగా సాగడం లేదు. దీంతో ప్రజలు రోడ్లపై వేసేస్తున్నారు. అదే డస్ట్‌బిన్నులు ఉంటే వాటిల్లోపడేసేవారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వివరణ ఇస్తూ బిన్స్ కొనుగోలుకు ఆర్డర్ పెట్టామని, వీటితో పాటు చెత్త సేకరణకు 40 తోపుడు బళ్లు, 400 చిన్న సైజు బిన్స్ కొనుగోలుకు ఆర్డర్ పెట్టామన్నారు.